రీ సర్వే సవ్యంగా జరిగేనా?

- ప్రభుత్వ భూములకు మారిపోయిన హక్కుదార్ల పేర్లు
- డీకేటీ పట్టాలు పేదలవి.. ఆన్‌లైన్‌లో మరోకరివి


బయ్యప్పగారిపల్లి గ్రామంలో భూముల రీసర్వే చేస్తున్న అధికారులు

బి.కొత్తకోట : బి.కొత్తకోట మండలంలోని బయ్యప్పగారిపల్లి రెవెన్యూ గ్రామంలో జరుగుతున్న భూముల రీసర్వేపైనే అందరి దృష్టి నెలకొంది. ఈ గ్రామం పరిధిలో బయ్యప్పగారిపల్లి, శీలంవారిపల్లి గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కొన్నిరోజులుగా గ్రామంలో రెవెన్యూ సిబ్బంది సర్వే నిర్వహిస్తున్నారు. సంబంధిత రైతులకు చెందిన భూముల సర్వే సమయంలో వారిని పిలిపించి వారి సమక్షంలోనే సర్వే చేస్తున్నట్టు చెబుతున్నా ఆన్‌లైన్‌లో వివరాల నమోదు సమయంలో లెక్కలు పక్కాగా ఉంటాయా లేదా అన్నదే ఇక్కడ పెద్దప్రశ్న.

పేదల భూములు గుర్తిస్తారా?

బయ్యప్పగారిపల్లి గ్రామంలో భూ సమస్యలు, వాటిపై ఫిర్యాదు తక్కువే అయినప్పటికి గుట్టు చప్పుడు కాకుండా తెరవెనుక నడిచిన వ్యవహారాలతో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయి. దశాబ్దాల క్రితం పేదలకు, ఎస్సీ, ఎస్టీలకు మంజూరు చేసిన డీకేటీ భూముల తీరు కూడా మారిపోయింది. అవినీతికి అలవాటు పడిన కొందరు రెవెన్యూ అధికారులతో భూ యజమానుల పేర్లు రాత్రికి రాత్రే మారిపోయాయి. 30 నుంచి 40 ఏళ్ల క్రితం పేదలకు పంపిణీ చేసిన ప్రభుత్వ భూములు ఏడాది క్రితం వరకు వారిపేర్లతోనే ఉన్నాయి. ఇప్పుడు కొందరి చేతుల్లోకి వెళ్లిపోవడంతో ఆన్‌లైన్‌లో రైతుల పేర్లు మారిపోయాయి. సాగు చేస్తున్న వారు మారిపోయారు. కొందరు రైతులకైతే తమకిచ్చిన డీకేటీ భూములు ఎక్కడున్నాయో కూడా తెలియని పరిస్థితి ఉంది. రీసర్వేలో దీన్ని గుర్తించి నిజమైన రైతుల పేరుతో రికార్డులు రూపొందిస్తారా లేక ఆక్రమించిన వారికే ధారాదత్తం చేస్తారా అన్నది తేలాల్సి ఉంది.

ఆన్‌లైన్‌లో ప్రత్యక్షం

బయ్యప్పగారిపల్లిలో ప్రభుత్వం ఇచ్చిన డీకేటీ భూములు కొందరి చేతుల్లోకి వెళ్లడమేకాదు నిషేధిత జాబితాలో ఉంచిన భూములు కూడా కొందరి పేర్లతో ఆన్‌లైన్ రికార్డుల్లో కనిపిస్తున్నాయి. నిషేధిత భూములకు హక్కులు కల్పించినా ఎవరికైనా పట్టా మంజూరు చేసినా అలాంటి అధికారులపై తీవ్రమైన చర్యలు తీసుకుంటారు. అలాంటి నిషేధిత భూములను కొందరికి కట్టబెట్టినట్టి ఆన్‌లైన్‌లో వివరాలు చూపుతున్నాయి. ఈ పరిస్థితుల్లో రీసర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది, అధికారులు ఈ విషయాలపై దృష్టి పెట్టి సర్వే నిర్వహిస్తారా లేక మమ అనిపిస్తారా అన్నది తేలాలి.

భూనిర్వాసితులకు న్యాయమైన పరిహారం


రైతులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

మదనపల్లె : సీటీఎం ఆర్వోబీ నిర్మాణంలో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు ప్రభుత్వం నుంచి న్యాయమైన పరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తానని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ అన్నారు. గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్వోబీ నిర్మాణానికి 11 హెక్టార్ల వరకు అదనంగా భూసేకరణ అవసరమని ఎన్‌హెచ్ అధికారులు కోరడంతో ఆ మేరకు రైతులతో సమావేశమయ్యారు. పరిహారం విషయమై రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిర్దేశిత ధరను రైతులకు తెలిపి, రైతులు కోరిన పరిహారంపై ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు తెలిపారు.

రీ సర్వేను పరిశీలించిన సబ్ కలెక్టర్

పెద్దమండ్యం : మండలంలోని వెలిగల్లు రెవెన్యూ గ్రామంలోని బండమీదపల్లె సమీపంలో విలేజ్ సర్వేయర్‌లు చేపడుతున్న సర్వేను మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలపై ఆరా తీశారు. సాగు చేసుకుంటున్న భూములకు రీ సర్వే చేస్తున్నా భాగ పరిష్కారాలు కాకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని రైతులు తెలిపారు. రైతులు భూముల రికార్డులను రీ సర్వే బృందాలకు చూపించి పరిష్కరించు కోవాలని సబ్ కలెక్టర్ సూచించారు. రోజువారీగా నిర్దేశించిన మేరకు సమన్వయంతో రీ సర్వే వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం పెద్దమండ్యంలో పక్కాగృహాల లే అవుట్‌ను ఆయన పరిశీలించారు. లే అవుట్‌లో ఎంత మందికి పట్టాలు ఇచ్చారు.. ఎంత మంది లబ్ధిదారులు ఇండ్లు నిర్మించుకొన్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అలాగే తహశీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. . రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకొవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ వెంకటరెడ్డి, తహసీల్దార్ సయ్యద్ అహ్మద్, రీ సర్వే డీటీ మాలా, ఆర్ఐ సయ్యద్ ఇమ్రాన్, మండల సర్వేయర్ హసీన్ తాజ్, హౌసింగ్ ఏఈ అక్రమ్, వీఆర్‌వోలు, గ్రామ సర్వేయర్‌లు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కె.రవి

పీలేరురూరల్ : సమాజంలో ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి కె. రవి అన్నారు. గురువారం మండలంలోని దొడ్డిపల్లె పంచాయతీ బంగారు అంచు హరిజనవాడలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ పోక్సో చట్టం పట్ల ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని తెలిపారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై ఆడ పిల్లలకు తెలియ చేయాలన్నారు. చిన్నపిల్లలను లైంగికంగా వేధించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం. భీమేశ్వర్‌రావు, న్యాయవాదులు పి.వి. రమణారెడ్డి, తెనాలి రామసుబ్రహ్మణ్యం, పారా లీగల్ వలంటీరు గట్టప్ప పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం


వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి

పీలేరు : వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు అధైర్య పడొద్దు... అండగా ఉంటామని ఆ పార్టీ నాయకులు పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, పెద్దిరెడ్డి అభినయరెడ్డి భరోసా ఇచ్చారు. గురువారం పీలేరులో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని తెలిపారు. అభివృద్ధి గూర్చి పట్టించుకోకుండా రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేయడానికే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరిందని తెలిపారు. అయితే ప్రస్తుతం అందుకు భిన్నంగా టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు మాత్రమే లబ్ధి చేకూర్చే విధంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చక్రధర్, షాకీర్, కాలనీ చిన్న, ద్వారకనాథరెడ్డి, మసీర్, అబీద్, నరేష్, భువన, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

మసీదులు, ఆలయాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలి


మాట్లాడుతున్న సర్పంచ్ హబీబ్‌బాషా

పీలేరురూరల్ : రంజాన్, ఉగాది పండుగలను పురస్కరించుకుని మసీదులు, ఆలయాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా సూచించారు. గురువారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో 24 మసీదులు, 14 దేవాలయాలు, ఒక ఈద్గా ఉందని తెలిపారు. అన్నింటిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. బ్లీచింగ్ చల్లడంతోపాటు అన్ని చోట్లా విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నౌషాద్, వార్డు మెంబరు విక్టరీ వెంకటరమణారెడ్డి, అబీద్ తదితరులు పాల్గొన్నారు.

బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు


బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పీలేరు : బాల కార్మికులను పనిలో పెట్టుకునేవారిపై చర్యలు తప్పవని లేబర్ ఆఫీసర్ ఆనందబాబు హెచ్చరించారు. గురువారం పీలేరు పట్టణంలో పాన్ ఇండియా బాల కార్యక్రమం, కార్మిక నిర్మూలన, పునరావాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ షాపుల యజమానులకు అవగాహన కల్పించారు. బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే రూ. 20 వేల నుంచి రూ. 50 వేల జరిమానా తోపాటు ఆరు నెలల నుంచి రెండు సంవత్సరాల వరకు జైలు శిక్ష పడే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో లోకేశ్వర్‌రెడ్డి, జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు గట్టప్ప, రాజమ్మ, లావణ్య, రాణమ్మ, రూప పాల్గొన్నారు.

వేలం పాట వాయిదా

రామసముద్రం : మండలంలోని చెంబకూరులో సర్పంచ్ రమణమ్మ అధ్యక్షతన గురువారం నిర్వహించిన వారపుసంత, దినసరి మార్కెట్, బస్టాండ్ బహిరంగ వేలం పాట వాయిదా పడింది. ఉదయం 11 గంటలకు అధికారులు సచివాలయంలో వేలంపాటకు సిద్ధం చేశారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఒక డిపాజిట్ మాత్రమే వచ్చింది. అనుకున్న స్థాయిలో డిపాజిట్‌దారులు రాకపోవడంతో వేలంపాట వాయిదా వేసినట్లు ఈఓపీఆర్డీ గఫూర్, పంచాయతీ సెక్రటరీ రెడ్డిశేఖర్ తెలిపారు.

అథ్లెటిక్స్‌లో లోహిత్ ప్రతిభ


సర్టిఫికెట్ అందుకుంటున్న విద్యార్థి లోహిత్

మదనపల్లె సిటీ : జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మదనపల్లె మండలం చిలకవారిపల్లెలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థి లోహిత్ ప్రతిభ కనబరిచాడు. 8వ తరగతి చదువుతున్న లోహిత్ ఈనెల 11 నుంచి 14వతేదీ వరకు జార్ఖండ్ రాష్ట్రం రాంచిలో జరిగిన 68వ జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో రాష్ట్రం తరఫున పాల్గొన్నారు. 400 మీటర్ల రిలే పరుగుపందెంలో ప్రతిభకనబరిచాడు. గురువారం పాఠశాలలో విద్యార్థి లోహిత్‌కు సర్టిఫికెట్ ,మెడల్స్‌ను స్కూల్ చైర్‌పర్సన్ అమృత, ప్రిన్సిపాల్ శ్రీదేవి అందజేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్నార్తుల ఆకలి తీర్చడానికే ఫుడ్‌బ్యాంక్ ఏర్పాటు

మదనపల్లె సిటీ : అనార్తుల ఆకలి తీర్చడానికే ఫుడ్‌బ్యాంకు ఏర్పాటు చేశామని హెల్పింగ్‌మైండ్స్ సంస్థ వ్యవస్థాపకులు అబూబకర్‌సిద్దిక్ అన్నారు. గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండు ఫుడ్‌బ్యాంకులో మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫుడ్‌బ్యాంకులో ఆహార పొట్లాలను పెట్టారు. అలాగే స్థానికులు అన్నదానం చేశారు. ఫుడ్‌బ్యాంకు ద్వారా ఎంతో మందికి ఆహారం అందుతున్నట్లు తెలిపారు. మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో యోధ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకులు సతీష్, మహేష్‌బాబు అభిమాన సంఘ నాయకులు అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు కులాలను ఆపాదించడం సరికాదు


మాట్లాడుతున్న తహసీల్దార్ భీమేశ్వర్‌రావు

పీలేరు : అధికారులకు కులాలను ఆపాదించడం సరికాదని తహశీసీల్దార్ భీమేశ్వర్‌రావు, సీఐ యుగంధర్ అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అధికారులు కులాలకు, రాజకీయాలకు అతీతంగా పని చేస్తారని తెలిపారు. ఒక కులానికో, ఓ వర్గానికో ఏకపక్షంగా వ్యవహరించరని చెప్పారు. రెండు మూడు రోజులుగా ఓ పొజిషన్ సర్టిఫికెట్ విషయంలో కొందరు కులా సంఘాల నాయకులు వారికి అనుకూలంగా పని చేయలేదనే అక్కసుతో ప్రసార మాధ్యమాలలో అధికారులు ఒక కులాన్ని చులకనగా చూస్తున్నట్లు మాలమహానాడు నాయకులు ఆరోపించడం సరైంది కాదన్నారు. తాము విధి నిర్వహణలో నిష్పక్షపాతంగా వ్యవహరిస్తామని తెలిపారు. కుల సంఘాల పేరుతో అధికారులపై తప్పుడు ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు.

పకడ్బందీగా రీ-సర్వే నిర్వహించాలి


వెంకటప్పకోటలో హౌసింగ్ వెరిఫికేషన్ నిర్వహిస్తున్న తహసీల్దార్ ధనంజయులు

మదనపల్లె : భూముల రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని మండల తహసీల్దార్ ధనంజయులు సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని వలసపల్లె పంచాయతీలో జరుగుతున్న రీసర్వేను గురువారం ఆయన పరిశీలించి, రెవెన్యూ అధికారులకు పలు సూచనలిచ్చారు. ముఖ్యంగా గ్రామకంఠాలు, ప్రభుత్వ, దేవాదాయ భూముల విషయంలో సమగ్ర సర్వేచేసి నివేదికలు రూపొందించాలని ఆదేశించారు. పీజీఆర్‌ఎస్ అర్జీలకు సకాలంలో పరిష్కరించేలా సిబ్బంది చొరవ చూపాలన్నారు. తర్వాత సాయంత్రం మండలంలోని వెంకప్పకోట పంచాయతీలో ప్రభుత్వ లేఔట్‌లో హౌసింగ్ వెరిఫికేషన్ నిర్వహించారు. ఇంటి పట్టా మంజూరైన లబ్దిదారులు నివాసం ఉంటున్నారా లేక ఇతరులకు విక్రయించారా అనే విషయమై లబ్ధిదారులను నేరుగా విచారించారు. తాగునీటి సమస్య, సచివాలయంలో పెండింగ్‌లో ఉన్నటువంటి పీజీఆర్‌ఎస్ దరఖాస్తులపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐ శేషాద్రిరావు, మండల సర్వేయర్ రెడ్డిశేఖర్, వీఆర్వో ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నోటి శుభ్రతతోనే ఆరోగ్యానికి భద్రత


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మానస

కేవీపల్లె : నోటి శుభ్రతతోనే ఆరోగ్యానికి భద్రత అని పీలేరు సీహెచ్‌సీ దంత వైద్యనిపుణులు డాక్టర్ మానస అన్నారు. ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని గురువారం మండలంలోని గర్నిమిట్ట పీహెచ్‌సీలో నోటి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దంతాలు, చిగుళ్లు, నాలుక ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోకపోతే దాని ప్రభావం శరీరంలోని ఇతర అవయవాలపై పడుతుందని తెలిపారు. మధుమేహం, క్యాన్సర్ వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. నోటి పరిశుభ్రతపై డెమో చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అర్చన, పర్యవేక్షకులు భాగ్యలక్ష్మి, రమాదేవి, రుక్మిణి, పురుషోత్తం ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు మృతి


గిరిబాబు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నిసార్‌అహ్మద్

రామసముద్రం : మదనపల్లె నియోజకవర్గం వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు, రామసముద్రం మండల సీనియర్ నాయకులు గిరిబాబు గురువారం ఆకస్మికంగా గుండెపోటుతో మృతి చెందారు. కుటుంబీకుల కథనం మేరకు.. గిరిబాబు ఇంటివద్ద ఉండగా, గుండెలో నొప్పి వస్తోందని చెప్పడంతో కుటుంబీకులు వెంటనే 108 అంబులెన్స్‌లో పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. గిరిబాబుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గిరిబాబు మరణవార్త తెలిసిన వెంటనే నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ రామసముద్రం మండలం మినికి గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. గిరిబాబు మృతికి సంతాపం తెలిపి, కుటుంబసభ్యులను పరామర్శించిన వారిలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కేశవరెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రటరీ గెవన్న, సుజ్ఞానమూర్తి, ప్రకాష్, కృష్ణప్ప, రాధారెడ్డి, నాగరాజ, ఈశ్వర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సమష్టి కృషితో క్షయవ్యాధిని నిర్మూలిద్దాం


క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

కేవీపల్లె : సమష్టి కృషితో క్షయవ్యాధిని నిర్మూలిద్దామని జిల్లేళ్లమంద పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. క్షయ వ్యాధి వారోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని జిల్లేళ్లమంద ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రజలకు క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వారాలు మించి దగ్గు, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, సాయంత్రం జ్వరం రావడం లాంటి లక్షణాలు ఉంటే సమీపంలోని పీహెచ్‌సీలో ఉచితంగా గళ్ల పరీక్ష చేయించుకోవాలని సూచించారు. క్షయవ్యాధి నిర్ధారణ అయిన రోగికి ఉచిత చికిత్సతోపాటు ప్రభుత్వం నుంచి ప్రతి నెలా రూ. వెయ్యి చొప్పున ఆరు నెలలపాటు రోగి బ్యాంకు ఖాతాలో జమ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీబీ యూనిట్ సూపర్‌వైజర్ పవన్ కుమార్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలకు పోషణతోపాటు విద్య అవసరం


మదనపల్లె : అంగన్‌వాడీలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ సుజాత


కేవీపల్లె : శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ రాజమ్మ


పీలేరు : అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్న అధికారులు

కేవీపల్లె : అంగన్‌వాడీ పిల్లలకు పోషణతోపాటు మంచి విద్య అందించాలని సీడీపీఓ రాజమ్మ అన్నారు. గురువారం మండలంలోని వగల్ల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 0–6 మధ్య వయస్సు పిల్లలకు ఆటల ద్వారా, తినడం ద్వారా, చూడడం ద్వారా, ప్రాజెక్టుల ద్వారా పిల్లలకు విద్యా నేర్పాలని సూచించారు. ఈ శిక్షణా కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అన్నపూర్ణ, శంకరమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు శిక్షణ

పెద్దతిప్పసముద్రం : బి.కొత్తకోట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పీటీఎం మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలకు శుక్రవారం 'పోషణ్ బీ-పోషణ్ పడా-ఈ' కార్యక్రమంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్లు జయరాణి, నాగరత్నమ్మ మాట్లాడుతూ పిల్లల శారీరక, మానసిక ఎదుగుదల, సమతుల్య ఆహారం, ఆట పాటలు, భాషాభివృద్ధి, గర్భిణులు తీసుకోవాల్సిన పోషకాహారం, ఆరోగ్యంపై మెళకువలు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమాన్ని ఎంఈఓలు నారాయణ, గౌస్‌పీర్ పర్యవేక్షించి పలు సూచనలిచ్చారు.

మదనపల్లె : పిల్లలకు పోషకాలు కలిగిన ఆహారం అందించడంతో పాటు చదువు పట్ల ఆకర్షితులయ్యేలా అవగాహన కల్పించేందుకు అంగన్‌వాడీ సిబ్బందికి పోషణ్ బీ, పఢాయి బీ కార్యక్రమంపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు ఐసీడీయస్ సీడీపీఓ సుజాత అన్నారు. మూడురోజుల పాటు సిబ్బందికి నిర్వహిస్తున్న శిక్షణా తరగతుల్లో భాగంగా గురువారం పోషణ్ బీ పడాయి బీ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీఓ సుజాత మాట్లాడుతూ అంగన్‌వాడీలలో ప్రారంభ బాల్య సంరక్షణ, విద్యపై దృష్టి సారించేందుకు కేంద్ర మహిళా, శిశుఅభివృద్ధి మంత్రిత్వశాఖ పోషణ్ బీ, పడాయ్ బీ ని ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో టీచర్ కరుణాకర్, సూపర్‌వైజర్లు శాంతమ్మ, భాను, లక్ష్మీదేవి, చంద్రకాంత, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

బోధన నైపుణ్యం పెంచేందుకు శిక్షణ

తంబళ్లపల్లె : అంగన్‌వాడీ కార్యకర్తలకు బోధన నైపుణ్యాలను పెంపొందించేందుకే శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు సీడీపీఓ నాగవేణి తెలిపారు. గురువారం కన్నెమడుగు, గోపిదిన్నె ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన శిక్షణా తరగతులను ఆమె ప్రారంభించారు. 0–3 సంవత్సరాల పిల్లలకు నవచేతన, 3–6 సంవత్సరాల పిల్లలకు ఆదర్శాల కార్యక్రమాలతో బోధన చేయడంపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ తరగతులు రెండు రోజుల పాటు జరుగుతాయన్నారు. పిల్లలకు నాణ్యమైన విద్య, అభివృద్ధితో పాటు సంరక్షణ కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కలకడ : బాలల సంరక్షణ తల్లిదండ్రులతోపాటు అంగన్‌వాడీ సిబ్బందిపై ఉందని సీడీపీఓ రాజమ్మ అన్నారు. గురువారం మండలంలోని కలకడ ఉర్దూ ఉన్నతపాఠశాలలో మండలంలోని అన్ని మెయిన్ అంగన్‌వాడీ వర్కర్లుకు శిక్షణ కార్యక్రమం నిర్వహించి ప్రసంగించారు. చిన్నారుల నమోదు తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. చిన్నారుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సిబ్బందిపై వేటు తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ యశోధరాణి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ ప్రాథమిక విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలి

పీలేరు : పూర్వ ప్రాథమిక విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈవో లోకేశ్వర్‌రెడ్డి, సీడీపీవో రాజమ్మ అన్నారు. గురువారం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ బీ పడాయి బీ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 0–6 మధ్య వయస్సు పిల్లలకు ఆటల ద్వారా, తినడం ద్వారా, చూడడం ద్వారా, ప్రాజెక్టుల ద్వారా పిల్లలకు విద్యా నేర్పాలన్నారు. ఈ శిక్షణా కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు స్వరూప, స్వర్ణ, అక్కయ్య, ఉమ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హార్సిలీ హిల్స్ ఘాట్‌రోడ్డులో చెట్ల కొమ్మలు తొలగింపు


చెట్ల కొమ్మలను తొలగిస్తున్న సిబ్బంది

బి.కొత్తకోట : మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ ఘాట్‌రోడ్డుకు ఇరువైపులా పొదలను గురువారం తొలగించారు. రోడ్డుపై రాకపోకలు సాగిస్తున్న పర్యాటకులకు పక్కనే ఉన్న మొక్కలు, చెట్ల కొమ్మలతో ఇబ్బందులు తలెత్తేవి. బైక్‌పై వెళ్లే వారి కళ్లకు కొమ్మలు తగిలి గాయాలయ్యేవి. దీనిపై రహదారి భవనాలశాఖ సిబ్బంది పొదలను, రోడ్డుపైకి వాలిన కొమ్మలను తొలగించి సౌకర్యం కల్పించారు.

నివాళి

మదనపల్లె : మండలంలోని అంకిశెట్టిపల్లె వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ వైస్ సర్పంచ్ సురేష్‌బాబు మృతదేహానికి నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ నివాళులు అర్పించారు. గురువారం సర్పంచ్ శరత్‌రెడ్డి, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి సురేష్‌బాబు ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. సురేష్‌బాబు అకాలమరణం ఎంతో బాధించిందని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఈశ్వర్‌నాయక్, కొత్తపల్లె మహేష్, రమణ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రపంచ భాష ఇంగ్లీషు


విశ్వం కళాశాల సమావేశంలో అతిథులు

కురబలకోట: ప్రస్తుత ప్రపంచంలో విద్య, ఉద్యోగ, ఉపాధి ఇతర దేశాల్లో రాణించాలంటే ఇంగ్లీషు కీలకమని అంగళ్లులోని విశ్వం విద్యాసంస్థల అధినేత ఎం. ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బిటెక్ విద్యార్థులకు 21 రోజుల ఇంగ్లీషు లర్న్ కోర్సు ముగింపు సందర్భంగా గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మేధా చిరంజీవి హైదరాబాద్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారన్నారు. గ్రామర్‌తో పాటు సులభంగా ఇంగ్లీషు ఎలా మాట్లాడాలో నేర్పించారని తెలిపారు. ప్రపంచంలో అత్యధికంగా మాట్లాడే భాష ఇంగ్లీషేనని ప్రిన్సిపాల్ రమణారెడ్డి అన్నారు. వృత్తి, వ్యక్తిగత జీవితంలో రాణించడానికి కీలకంగా పనిచేస్తుందన్నారు. జాతీయ, అంతర్జాతీయంగా ఉనికి చాటవచ్చని పేర్కొన్నారు.

నల్లమందు పేలి ఒకరికి గాయాలు


గాయపడిన రాము

కలకడ : నల్లమందు(ఆర్డీఎక్స్) పేలి దివ్యాంగుడు గాయపడిన సంఘటన గురువారం మండలంలోని బంగారువాండ్లపల్లె వద్ద జరిగింది. బాధితుడు, పోలీసుల కథనం మేరకు.. తమిళనాడు రాష్ట్రం, ఉండమల్లె గ్రామానికి చెందిన దివ్యాంగుడు కె.రాము(45) కోన వద్ద క్వారీలో పనిచేస్తున్నాడు. గురువారం బండలు చీల్చడానికి వినియోగించే నల్లమందు(ఆర్డీఎక్స్) ఆరబెట్టే పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు పేలిందని స్థానికులు తెలిపారు. రాముకు తీవ్ర గాయాలవడంతో 108లో పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కలకడ ఎస్ఐ రామాంజనేయులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భవన నిర్మాణ కార్మికుడికి తీవ్రగాయాలు


గాయ పడిన శ్రీనివాసులు

మదనపల్లె : యంత్రం మీద పడి భవన నిర్మాణ కార్మికుడు తీవ్రంగా గాయపడిన సంఘటన ములకలచెరువు మండలంలో జరిగింది. వేపూరికోట పంచాయతీ ఆవులపల్లెకు చెందిన శ్రీనివాసులు(50) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. పక్క గ్రామమైన బండమీదపల్లెలో నిర్మాణంలో ఉన్న నూతన భవనానికి మోల్డింగ్ వేసేందుకు వెళ్లి రంపంతో కొయ్యలు కోస్తున్నారు. ప్రమాదవశాత్తూ యంత్రం కాలు మీద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు బాధితుడిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. అత్యవసర సేవల అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

రూ.20 లక్షలకు సంత వేలం

రామాపురం : మండల కేంద్రంలో వారంతపు శనివారం నిర్వహించే పశువుల సంత 2025–26 ఆర్థిక సంవత్సరంలో పశువుల సంతతోపాటు బస్టాండు గేటు వేలం గురువారం బహిరంగ వేలంపాటను నల్లగుట్టపల్లె సర్పంచ్ నాగభూషణ్‌రెడ్డి ఆదేశాలతో వేలం పాట నిర్వహించారు. పశువుల సంతను కనపర్తి చంద్రశేఖర్‌రెడ్డి రూ.20 లక్షలు, బస్టాండ్ గేటు సాకే వెంకటరమణ రూ.1.60 లక్షలకు దక్కించుకున్నారు.